# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షాతో సమావేశం అవుతారు.**
2. **రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్థన్ రెడ్డి తెలిపారు.**
3. **రాష్ట్రంలో 143 కోట్ల రూపాయలతో సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టామని మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.**
4. **కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమానికి ప్రాధ్యాన్యతనిస్తున్నాయని రాష్ట్ర గిరిజన కమిషన్ ఛైర్మన్ డివిజి శంకరరావు అన్నారు.**
5. **తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని నిర్వహించారు.**

=========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న ఆయన కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాతో సమావేశం అవుతారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించనున్నారు. అనంతరం జన్‌పథ్‌లో నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వీకే సరస్వత్‌తో సమావేశమవుతారు. అలాగే ఢిల్లీ మెట్రో మేనేజింగ్ డైరెక్టర్‌తో సమావేశమై.. రాష్ట్రంలో నిర్మించే మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చిస్తారు. తర్వాత సాయంత్రం మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావు సంస్మరణ సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. రాత్రి కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్‌తో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని రహదారులు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్థన్ రెడ్డి తెలిపారు. అన్నమయ్యజిల్లా తంబళ్ళపల్లిలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి ఈరోజు పాల్గొని.. ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్.. 31 సెకన్లు

--------------------------

రాష్ట్రంలో 143 కోట్ల రూపాయల వ్యయంతో గురుకులాలు సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేపట్టామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా పొదిలిలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన నిన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన బియ్యంతో భోజనం అందిస్తున్నామన్నారు.

----------------------------

కేంద్ర వాణిజ్యశాఖ ప్రకటించిన 'ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి' అవార్డుల్లో రాష్ట్రం 10 పురస్కారాలను అందుకుంది. ఢిల్లీలోని భారత మండపంలో నిన్న జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్‌లు ఆయా జిల్లాల కలెక్టర్లకు అవార్డులు ప్రధానం చేశారు. దీనిపై మరిన్ని వివరాలు ఇప్పుడు విందాం..

వాయిస్ ..36 సెకన్లు

----------------------------

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈరోజు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించామని తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారి జె.శ్యామల రావు తెలిపారు. ఆణివార ఆస్థానం సందర్భంగా ఆలయ శుద్ధి కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈరోజు తిరుమలలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఏడాదిలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తామని చెప్పారు. ఉగాది ఆస్థానం, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాలకు ముందు మంగళవారం ఆలయ శుద్ధి చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ ..26 సెకన్లు

----------------------------

యువత ఉన్నత వృత్తి నైపుణ్యాలను నేర్చుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చని అనంతపురం జిల్లా మేరా యువ భారత్ కార్యాలయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం సందర్భంగా ఈ రోజు అనంతపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా యువత కృత్రిమమేధ వంటి అంశాలలో ప్రావీణ్యం పొందాలని సూచించారు.

----------------------------

ప్రభుత్వ, ప్రయివేట్, ప్రజల భాగస్వామ్యం – పీ4 కార్యక్రమం కింద బంగారు కుటుంబాల ధృవీకరణ కోసం ఈ రోజు నుంచి ఈ నెల 25 వరకూ గ్రామ సభలను నిర్వహిస్తున్నామని శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ తెలిపారు. గత ఏడాది మార్చిలో పీ4 కింద సర్వే నిర్వహించి బంగారు కుటుంబాలకు అర్హులైన వారిని గుర్తించామన్నారు. ఈ పథకాన్ని ఎక్కువ మందికి చేరువ చేసే ప్రక్రియలో భాగంగా గ్రామ, వార్డు సభలను నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.

----------------------------

ఉత్పత్తుల నాణ్యతను పెంచేలా కేంద్ర ప్రభుత్వం ఇండియన్ స్టాండర్డ్స్ ఇన్‌స్టిట్యూట్ మార్క్– ఐఎస్ఐ

గుర్తును తప్పనిసరి చేసిందని భారత ప్రమాణాల సంస్థ – బిఎస్ఐ విజయవాడ శాఖ డిప్యూటీ డైరెక్టర్ వివేక్ వర్ధన్ రెడ్డి తెలిపారు. విజయవాడలోని ఉత్పత్తుల నిల్వ గోదాముల్లో ఆయన నిన్న సోదాలను నిర్వహించి పలు నాసిరకం ఉత్పత్తులను జప్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ...

వాయిస్ 28 సెకన్లు

---------------------------

మధ్యవర్తిత్వం ద్వారా సివిల్, క్రిమినల్ కేసులలో త్వరితగతిన పరిష్కారాలను పొందవచ్చని చీరాల సీనియర్ సివిల్ జడ్జి ఎమ్.సుధ తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వంపై బాపట్ల జిల్లా చీరాలలో ఈరోజు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో న్యాయమూర్తులు,న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సివిల్ జడ్జి ఎమ్.సుధ మాట్లాడుతూ, మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించేందుకు మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని తెలిపారు.

---------------------------

తోతాపురి మామిడికి ప్రభుత్వం అందించే రాయితీ దుర్వినియోగం కాకుండా అధికారులు చర్యలు చేపట్టాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. మామిడి పంటకు అందించే రాయితీపై కలెక్టర్ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు దాదాపు మూడు లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి మామిడిని రైతుల నుండి సేకరించి మామిడి గుజ్జు పరిశ్రమలకు అందించడం జరిగిందని తెలిపారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు లాభాలలో కొనసాగుతున్నాయి.మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 396 పాయింట్ల లాభంతో 82 వేల 646 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 134 పాయింట్ల లాభంతో 25 వేల 217 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో ఈ రోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..28 సెకన్లు

=====================